సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 14 । మార్చి । 2025



గోడౌన్‌లలో పోలీసుల తనిఖీలు

ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప నగరంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్‌లలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర॥ (సా॥)	సహర్ శని॥ (ఉ॥)
కడప	: 6.31	5.09
పులివెందుల	: 6.33	5.14
ప్రొద్దుటూరు	: 6.32	5.13

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4/22.6

జిల్లాలో గురువారం 22.6 - 39.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వెబ్ ఆప్షన్లను పూర్తి చేయండి

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు సంబంధించి వెబ్ ఆప్షన్‌లను పూర్తి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. ఇందుకు సంబంధించి జ్ఞానభూమి వెబ్ ఆప్షన్ సర్వీస్ ప్రారంభమైందన్నారు. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులు 15న లేదా అంతకుముందు వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా ఎంప్యానెల్డ్ కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలను తెలియజేయాలని పేర్కొన్నారు. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితాను ఏపీసీఎఫ్ఎస్ఎస్ వెబ్ పోర్టల్‌లో చూడవచ్చని తెలిపారు.


15న బద్వేలులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు బద్వేలు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం కంపెనీలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డానో బీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో టెలీ కాలింగ్ ఆఫీసర్, ఆల్ డిక్సన్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, క్వాలిటీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18-45 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి అర్హతను, అనుభవాన్ని బట్టి రూ. 12-25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హతలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

యూత్ పార్లమెంట్ ఉపన్యాసాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: భారత ప్రభుత్వ యువజన, క్రీడా వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆదేశాల మేరకు యూత్ పార్లమెంటు ఉపన్యాసాల పోటీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి మార్చి 16 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా యువజన అధికారి మణికంఠ తెలియజేశారు. పోటీలలో పాల్గొని యువత వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశం పైన ఉపన్యాసాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారని చెప్పారు. అన్నమయ్య, కడప జిల్లా పరిధిలోని 18 నుంచి 25 ఏళ్లలోపు యువత రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అవకాశం కల్పించారన్నారు. మార్చి 15వ తేదీన కెఎస్ఆర్ఎమ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించాల్సిన ఉపన్యాసాల పోటీలు, రిజిస్ట్రేషన్ గడువు పెంపు కారణంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 9177616677 సంప్రదించాలని సూచించారు.

మొల్లమాంబ గొప్ప కవయిత్రి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: సరళమైన తెలుగు భాషలో రామాయణం రచించి సమాజానికి అందించిన గొప్ప కవయిత్రి మొల్లమాంబ అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభా భవన్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతనమొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాహితీవేత్త నరాల రామారెడ్డి, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంత రావు హాజరుకాగా జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్, డీఆర్ ఓ విశ్వేశ్వరనాయుడు , ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవీయ విలువలకు ప్రాధాన్యత నిస్తూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు వివక్షతకు వ్యతిరేకంగా తన రచనలు చేశారని కొనియాడారు. బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, మొల్ల సాహితీ పీఠం సభ్యులు పాల్గొన్నారు.

కదలరు.. వదలరు

అన్ని ప్రభుత్వ శాఖల యందు 'వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం'తీరే వేరయా అన్న చందంగా మారింది ఇక్కడి పరిస్థితి. ఈ శాఖలో పోస్టింగ్ కోసం ఉద్యోగులు ఉబలాటపడుతున్నారు. ఎలాగైనా ఇక్కడ కొలువు దీరాలని కొందరు ప్రయత్నిస్తుంటే.. ఇప్పటికే ఉన్నవారు తమ కుర్చీని కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

- అక్కడికి పోస్టింగ్ అంటే ఉబలాటం
- వచ్చాక వెళ్లకుండా ఉండడానికి ఆరాటం
- గత్యంతరం లేక వెళ్లాల్సివస్తే మళ్లీ రావడానికి ప్రయత్నం
- ఇదీ 'వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 కార్యాలయం'తీరు



కడప రూరల్: జిల్లా కేంద్రమైన కడప పాత రిమ్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఉంది. ఇది జోన్-4 కార్యాలయం. రాయలసీమ జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ విభాగాల్లో పనిచేస్తున్న దాదాపు 17 కేడర్లు, 13 వేల మందికి పైగా ఉద్యోగులు ఈ శాఖ పరిధిలోకి వస్తారు. ఇక్కడ ఉద్యోగుల పదోన్నతులతో పాటు సర్వీసుకు సంబంధించిన అంశాలు వస్తాయి. అలాగే ఇక్కడ స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ తదితర ఉద్యోగ నియామకాలను చేపడుతుంటారు. ఈ జాబితా ఈ శాఖ ఎంత కీలకమైందో చెప్పకనే చెబుతోంది. ఇలాంటి ముఖ్యమైన శాఖలో పనిచేయడానికి ఉద్యోగులు తహ తహలాడుతుంటారు. ఇక్కడ ఏది జరిగినా కూడా ఆ అంశం జోన్-4 (రాయలసీమ) వ్యాప్తంగా తీవ్ర చర్చ కొనసాగుతుంది.

ఇక్కడికి రావడానికి అనేక ప్రయత్నాలు...

సాధారణంగా వర్క్ ఆర్డర్, డిప్యుటేషన్‌లు అంటే 'వర్క్ లోడ్'(పని భారం) ఎక్కువగా ఉన్నప్పుడు సంబంధిత అధికారి తమకు ఉద్యోగుల అవసరం అని ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వారి ఆదేశాల ప్రకారం ఇతర విభాగాల్లో పనిచేస్తున్న తమకు అనుకూలమైన 'అన్ని పనులు తెలిసిన' వారిని రప్పించుకోవడానికి మార్గం ఏర్పడుతుంది. ఇక్కడి వైద్య ఆరోగ్య శాఖలో పని భారం ఉన్నా..లేకున్నా వర్క్ ఆర్డర్, డిప్యుటేషన్‌లపై కోరుకున్న చోటికి రప్పించుకోవడం ఒక సాకుగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి.

- ప్రొద్దుటూరు సమీపంలోని ఒక పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఒక సీనియర్ అసిస్టెంట్, తిరుపతిలో ఒక విభాగంలో పనిచేస్తున్న మరొక సీనియర్ అసిస్టెంట్ వర్క్ ఆర్డర్‌పై వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి రావడానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఇక్కడి నుంచి ఫైల్స్ వెళ్లాయి. అక్కడి ఉన్నతాధికారులు ఆ ఫైల్స్‌ను పక్కన పెట్టినట్లు తెలిసింది. ఈ వర్క్ ఆర్డర్ జరుగుతుందా..లేదా అనేది పక్కనబెడితే.. తాజాగా ప్రభుత్వం వర్క్ ఆర్డర్స్, డిప్యుటేషన్లపై 'బ్యాన్'విధించింది. అయినా ఇందుకు సంబంధించిన పత్రాలు వెళ్లడం గమనార్హం. ఇంకో ఆసక్తికరమైన అంశం ఏమంటే ఇక్కడ పనిచేసి వెళ్లిన మరొక ఉద్యోగి కూడా మళ్లీ ఇక్కడికే రావడానికి చాలా నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఆ శాఖలో పనిచేయడానికి ఉద్యోగుల మధ్య పోటీ నెలకొంది. ఈ విధంగా మొదటి నుంచి ఉద్యోగులు ఈ శాఖలో పోస్టింగ్ పొందడానికి పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఏదోలా ఇక్కడికి వచ్చాక 'ఫెవికాల్ వీరుల్లా'మారిపోతారు. వెళ్లాల్సి వస్తే మళ్లీ రావడానికి అడ్డదారులు వెతుకుతారు. అందుకే ఈ శాఖలో పోస్టింగ్‌కు సంబంధించి 'కదలరు.. వదలరు'అని అం టుంటారు. మరి అందరికే ఇదే ఎందుకిష్టమంటే 'పైసా మే పరమాత్మ' అనే గుసుగుసలు వినిపిస్తాయి.

నేతల మధ్య ఆధిపత్యం..

వైద్య ఆరోగ్య శాఖ విభాగాలకు సంబంధించి రాయలసీమ (జోన్-4) జిల్లాల్లో ఆరుకు పైగా ఉద్యోగ సంఘాలు ఉన్నాయి. కొన్నింటి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఒకరు అవునంటే..మరొకరు కాదంటారు. అలాగే తమకు అనుకూలమైన వారిని కీలకమైన పోస్టింగ్‌ల్లో నియమించుకోవడానికి, అనుకూలమైన చోటికి బదిలీలు చేయించుకోవడానికి పోటీ పడుతుంటారు. ఉద్యోగుల అంశానికి సంబంధించి ఏదైనా సరే ప్రభుత్వ నిబంధనలు అందరికీ ఒకే విధంగా వర్తించేలా అటు అధికారులు..ఇటు ఉద్యోగ సంఘాల నేతలు చూడాలని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు కోరుతున్నారు. మరి ప్రభుత్వ పెద్దలు..ఉన్నతాధికారులు ఉద్యోగుల మాటలు ఆలకిస్తారో లేదో చూడాలి.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలు పకడ్బందీ భద్రత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 161 పరీక్షా కేంద్రాలలో 14,330 మంది బాలురు, 13,470 మంది బాలికలు మొత్తం 27,800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను కల్పించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఎక్కడ మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కడప,బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, చిన్నయ్య, సాయిశ్రీ, తహసీల్దార్‌లు, విద్యా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి

ప్రభుత్వ, దాతల, ప్రజల, భాగస్వామ్యం (పీ4) సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి చేకూరుతుందని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సభా భవనంలో పీ4 సర్వేపై ప్రజా అభిప్రాయం కోసం జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రజలు, దాతలు పార్టనర్‌షిప్‌తో అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను, అత్యున్నతంగా ఉన్న 10 శాతం సంపన్నులు ద్వారా అభివృద్ధి చేయడం పీ4 ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాబోయే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం 'జీరో పావర్టీ -పీ4 పాలసీ'అమలుకు కృషి చేస్తోందన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు, మేధావులు, నిపుణులు,ప్రజలు తమ సహకారాలు అందించి పీ4 మోడల్ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశ అనంతరం పారిశ్రామిక వేత్తలు, బ్యాంక్ అధికారులు, ఇతరులు పీ4 విధానంపై సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులను జాప్యం చేయకుండా త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులు, రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, పౌర సరఫరాల పంపిణీపై జేసీ అదితి సింగ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. సంబంధిత తహసీల్దార్ వద్దకు వచ్చిన దరఖాస్తును రెండు రోజుల్లో పరిశీలించి పరిష్కరించాలన్నారు. సకాలంలో అనుమతులు ఇవ్వక జాప్యం చేసి అక్రమ మైనింగ్‌కు ఆస్కారం ఇవ్వవద్దన్నారు. రెవెన్యూ సదస్సులు, గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పౌర సరఫరాల అంశంలో వంట గ్యాస్ పంపిణీ, నిత్యావసర వస్తువుల పంపిణీ, తూకాల వ్యత్యాసంపై తరచు తనిఖీలు తదితరులపై వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు జారీచేశారు.

రైతుల తరఫున పోరాటం చేస్తాం



ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సమస్యలను వివరిస్తున్న ప్రజలు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పష్టీకరణ

మైలవరం: దాల్మియా ప్రభావిత గ్రామాలైన దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామ రైతు సమస్యలపై పోరాటం చేస్తామని ఎంపీ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజాభిప్రాయ సేకరణ మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. దుగ్గనపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మిర్చి రైతు మోషే కుటుంబాన్ని గురువారం మధ్యాహ్నం పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని గురించి ఎంపీకి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుగ్గనపల్లి,నవాబుపేట గ్రామాలకు ప్రధానంగా రెండు సమస్యలు పొంచి ఉన్నాయన్నారు. అందులో కాలుష్యం ఒకటి కాగా.. పంటల నీట మునక మరో ప్రధాన సమస్య అని తెలిపారు. ఈ విషయంపై రైతులు లోకాయుక్తను ఆశ్రయించగా అందుకు సంబంధించిన పూర్తి నివేదక కోసం కమిటీ వేశారన్నారు. అది పూర్తి కాకముందే ప్రజాభిప్రాయ సేకరణ చేసి పరిశ్రమ విస్తరణకు ముందుకు సాగడం మంచిదికాదన్నారు. ప్రస్తుతం ఇక్కడ గ్రామాలలో ఉన్న సమస్యలపై పార్టీ తరఫున కలెక్టర్‌ను కలిసి వివరిస్తామన్నారు. 27వ తేదిన తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసేదుకు ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం రెండు గ్రా మా ల‌కు సంబంధించిన మునక భూములు, దుమ్ము, ధూళి నిండిన పొలాలను పరిశీలించారు.

రెండు లక్షల పరిహారం అందజేత

రైతు మోషే కుటుంబ సభ్యులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మోషే కుమారుడు ఏలియాజర్, కుమార్తెలు దీవెనమ్మ, మణి కుమారిలకు రెండు లక్షల పరిహారం అందించారు. ఎప్పుడు ఏ ఆపదొచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలి: ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

దాల్మియా పరిశ్రమ విస్తరణకు సంబంధించి ఈనెల 27వతేదిన జరిగే ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయకపోతే ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారం కావని.. ఆపై యాజమాన్యం పట్టించుకునే పరిస్థితి ఉండదన్నారు. నవాబుపేట నాయకులు భాస్కర్‌రెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్‌రెడ్డి, కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, గిరిధర్‌రెడ్డి, శివగుర్విరెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వెంపలాకు రామాంజనేయుల యాదవ్, జడ్పీటీసీ మహాలక్ష్మీ, హృషికేశవరెడ్డి ,శంకర్‌రెడ్డి,చిన్నయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 21వ తేది జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య నిర్వాహణాధికారి ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఇరు జిల్లాల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

పశువైద్య విద్యార్థులకు తల్లిదండ్రుల మద్దతు

ప్రొద్దుటూరు రూరల్: స్టైఫండ్ పెంచాలని పశువైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక దీక్షలకు గురువారం వారి తల్లిదండ్రులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ 39 రోజులుగా తమ పిల్లలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరిని పిల్లలకు న్యాయం చేయాలని కోరారు.



పశువైద్య విద్యార్థుల దీక్షలో కూర్చున్న తల్లిదండ్రులు

టెలీ కాన్ఫరెన్సులతో టెన్షన్

ప్రభుత్వం ఏదైనా ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహించినప్పుడో లేదా విద్యుత్ సంస్థ ప్రత్యేక ప్రోగ్రాం నిర్వహించినప్పుడో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులతో టెలీ కాన్ఫరెన్స్‌లు, మీటింగ్‌లు అనుసరించడంలో అర్థముంది. జిల్లాలో అలా జరగడం లేదు. వారానికి రెండు సార్లు జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరితో రెండు, మూడు గంటల పాటు అదేపనిగా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ కోసం సిబ్బంది ఫోన్లు పని చేయక జనం ఇబ్బంది పడుతున్నారు.



విద్యుత్ భవన్

- విద్యుత్ శాఖలో వారానికి రెండుసార్లు కొన్ని గంటలపాటు స్తంభించిపోతున్న కార్యకలాపాలు
- ఆ సమయంలో పనిచేయని విద్యుత్ సిబ్బంది ఫోన్లు
- ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు స్పందించని క్షేత్రస్థాయి సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం

కడప టాస్క్‌ఫోర్స్: ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్)లో నిర్వహిస్తున్న వరుస టెలీ కాన్ఫరెన్సులతో అటు ప్రజలు, ఇటు విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అనేది అత్యవసరాల్లో పనిచేసే ప్రభుత్వ శాఖల్లో ప్రధానమైనదిగా చెప్పవచ్చు. ఇతర శాఖల సిబ్బందికైనా కొన్ని నిముషాలు, గంటల వ్యవధి ఉంటుంది. కానీ విద్యుత్ శాఖలో మాత్రం సెకన్లు, నిముషాల్లో స్పందించకపోతే భారీ నష్టం చవి చూడక తప్పదు. ప్రతి మంగళవారం, శనివారం జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు స్వయంగా ఈ టెలీ కాన్ఫరెన్స్ నిర్వస్తుంటారు. ఆ రోజుల్లో సాయంత్రం 5 గంటల నుంచి రెండు, మూడు గంటలపాటు టెలీ కాన్ఫరెన్స్ ఉంటుంది. ఈ సమయంలో విద్యుత్ పరంగా ప్రజలకు ఏ సమస్యలు వచ్చినా....ఉదాహరణకు విద్యుత్ లైన్లు తెగిపడినా, లైన్లు తగులుకొని ఎవరైనా జంతువుగానీ, మనిషిగానీ చనిపోయినా...ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, మంటలు రేగినా ఇతరత్రా ఏ సమస్య వచ్చినా విద్యుత్ సిబ్బందికి చెబుదామంటే వారి ఫోన్లు పనిచేయవు. వారి ఉన్నతాధికారులకు చెప్పాలనుకుంటే అదీ కుదరదు. ఎందుకంటే వారంతా విద్యుత్ శాఖ సిబ్బంది మొత్తం టెలీ కాన్ఫరెన్స్‌లో బిజీగా ఉంటారు. ఇది ఒకరోజుతో పోయేది కాదు...వారానికి రెండు సార్లు, రెండు, మూడు గంటలపాటు కొనసాగుతూనే ఉంటుంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈఈలు, ఏఈలు, ఏఓలు, జేఏఓలు, లైన్‌మెన్లు, ఏఎల్ఎంలు, జేఎల్ఎంలు, ఎనర్జీ అసిస్టెంట్లు, సబ్ స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు, వాచ్‌మెన్లు అందరూ ఎక్కడ ఎన్నా...ఏ పరిస్థితుల్లో ఉన్నా టెలీ కాన్ఫరెన్సుకు హాజరై తీరాల్సిందే. లేకుంటే వారికి వెంటనే మెమోలు జారీ అవుతాయి. ప్రతిరోజూ ఉదయం విద్యుత్ సిబ్బంది డిస్‌కనెక్షన్ లిస్టు పట్టుకొని ఇంటింటికీ వెళ్లి కరెంటు బిల్లులు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తుంటారు...ఒకవేళ వారు వెంటనే బిల్లులు చెల్లిస్తే సాయంత్రంలోపు విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాల్సి ఉంటుంది. మిగతా అన్ని రోజులూ ఇబ్బంది లేదుగానీ ఆ రెండురోజుల్లో మాత్రం సమస్యలెదురవుతున్నాయి.

చీకటిలో పని చేయలేక...

సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించడం వల్ల అప్పటికే చీకటి పడిపోతోంది. ఆ సమయంలో సిబ్బంది స్తంభాలు ఎక్కి పనిచేయడం కష్టతరమవుతోంది. విద్యుత్ సిబ్బంది పనిచేయకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా ఎవరో ఒకరి చేత విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదేకాదు కరెంటు పోయినా, లైన్లు తెగినా, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా ఆ సమయంలో ప్రజల గోడు వినే నాథుడే ఉండటం లేదు. సాధారణంగా ఎస్ఈ స్థాయిలోని అధికారి ఈఈలు, డీఈలు, ఏఈలు, ఏఓలు వంటి అధికారులతోనే టెలీ కాన్ఫరెన్సులు నిర్వహించడం ఆనవాయితీ. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు స్పందించాల్సిన చిన్న స్థాయి ఉద్యోగులను కూడా టెలీ కాన్ఫరెన్స్‌లోకి తీసుకోవడంతో వారు ఆ సాకు చెప్పి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్లు ఉన్నాయి. ఇందులో ఉన్న సబ్‌స్టేషన్లలో సుమారు 1000 మంది పనిచేస్తున్నారు. ఇందులోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో ఒకేసారి టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి చిన్న స్థాయి ఉద్యోగులందరికీ తెలిసేలా వారిపై అధికారులను తిడుతుండటం వల్ల వారు మానసిక వేదనకు గురవుతున్నట్లు సమాచారం. తాము ఏదైనా తప్పు చేసినా, సరిగా పనిచేయకపోయినా ఉన్నతాధికారి పిలిచి మందలించవచ్చు. ఇలా టెలీ కాన్ఫరెన్స్‌లో అందరి సమక్షంలో తిట్టడం వల్ల వారు అవమానంగా భావిస్తున్నట్లు సమాచారం. ఏఈలు చెప్పినట్లు లైన్‌మెన్లు, ఆపరేటర్లు, వాచ్‌మెన్లు పనిచేస్తారు కాబట్టి ఏఈలతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తే సరిపోతుంది. అలా కాకుండా ప్రజలకు, విద్యుత్ సంస్థకు వారధిగా ఉండి ప్రజలకు కావాల్సిన పనులు చేసిపెట్టే క్షేత్ర స్థాయి సిబ్బందితో నిర్వహించడం వల్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెప్పేవారికి వినేవారు లోకువ అన్న చందంగా వారానికి రెండు సార్లు చెప్పిందే గంటలు, గంటలు చెప్పడం వల్ల అందరికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావమే ఒక ప్రభంజనం

- అధికారంలోకి రాకపోయినా 9 ఏళ్లు పార్టీని నడపడం సామాన్య విషయం కాదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావమే ఒక ప్రభంజనమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ 15వ వసంతంలోకి అడుగుపెట్టడం సంతోషదాయకమన్నారు. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల వల్ల ఈ పార్టీ పోరాటాల నుంచి పుట్టిందన్నారు. కాంగ్రెస్, టీడీపీ కుమ్మక్కై ఎన్నో రకాలుగా వేధించి, అవినీతి ఆరోపణలు చేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని 16నెలలు జైల్లో పెట్టారన్నారు, 2014లో 67 సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్షంగా మారిందన్నారు. ఏదైనా ప్రాంతీయ పార్టీ ఆవిర్భవించిన వెంటనే అధికారంలోకి రాకపోతే కనుమరుగవడం ఖాయమని, కానీ వైఎస్సార్‌సీపీ మొదటిసారి అధికారంలోకి రాకపోయినా 9 ఏళ్లు నిలబెట్టడమంటే ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. చిరంజీవిలాంటివారే రెండేళ్లకే పార్టీని అమ్ముకున్నారని గుర్తు చేశారు. ఆయా సంక్షేమ పథకాలతో ఏపీలో ఎన్టీఆర్, వైఎస్సార్, వైఎస్ జగన్ ముగ్గురు ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచారన్నారు. విద్యా వ్యవస్థలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేసి మెడికల్ సీట్లు సాధిస్తే వాటిని వద్దని లేఖ రాసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేని ధ్వజమెత్తారు. 2024లో వైఎస్సార్‌సీపీ సంఖ్యాపరంగా ఓటమిపాలైనా 40 శాతం ఓట్లతో ప్రజల మనసు గెలుచుకుందన్నారు. జిల్లాలోని కాశినాయన క్షేత్రంలో అన్న సత్రాలు కూల్చివేస్తుంటే ...ధర్మాని పరిరక్షిస్తానన్న పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సంపద సృష్టించి ఎన్నికల హామీలు అమలు చేస్తానన్న బాబు, ఇప్పుడు సంపద ఎలా సృష్టించాలో తన చెవిలో చెప్పమంటున్నారని ఎద్దేవా చేశారు. జెడ్పీ వైస్ ఛైర్మెన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలం ఆక్రమణపై కేసు నమోదు

పోరుమామిళ్ల : సిద్దవరం గ్రామానికి చెందిన నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. చల్లగిరిగెల గ్రామ రెవెన్యూ పొలంలో నాగిరెడ్డికి చెందిన భూమిని మంగనపల్లెకు చెందిన ఆంజనేయులు ఆక్రమించుకొనేందుకు ప్రయత్నం చేశాడన్నారు. అలాగే పొలం చుట్టూ నాటిన స్తంభాలను ధ్వంసం చేశాడని, అడ్డం వస్తే చంపుతానని బెదిరించాడని నాగిరెడ్డి ఫిర్యాదు చేశాడన్నారు. గతంలో కూడా ఆంజనేయులు తనపై దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల వితరణ



పోలీస్ స్టేషన్‌కు బారికేడ్లను అందిస్తున్న భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌కు భారతి సిమెంటు కంపెనీ 10 బారికేడ్లను వితరణగా అందించినట్లు ఎస్ఐ తులసీనాగ ప్రసాద్ తెలిపారు. గురువారం భారతి సిమెంటు కంపెనీ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భారతి సిమెంటు కంపెనీ డీలర్ మల్లికార్జునరెడ్డిలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో 10 నూతన బారికేడ్లను ప్రారంభించి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా భారతి సిమెంటు కంపెనీ తరపున ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రెడ్డి, పోలీసు సిబ్బంది, భారతి సిమెంట్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి తెలియకుండా కట్టడాలు కూల్చివేస్తారా

కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి



కూల్చివేసిన కట్టడాలను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : ప్రభుత్వానికి తెలియకుండా జ్యోతి క్షేత్రం కాశినాయన ఆశ్రమంలోని నిర్మాణాలను ఎలా కూల్చివేస్తారని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నించారు. కాశినాయన మండలంలోని జ్యోతిక్షేత్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. కాశినాయన సమాధి, లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాశినాయన ఆశ్రమంలో అటవీశాఖ అధికారులు అనుమతులు లేవంటూ కూల్చివేసిన గోశాల, క్షౌ రశాల, వసతిగదులు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణుల సత్రాలు, మరుగుదొడ్లతో పాటు భోజనశాల, వంటశాలలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాది మంది కాశినాయన సమాధిని దర్శించుకుని భోజనం చేసి వెళుతుంటారన్నారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న కాశినాయన ఆశ్రమంలో అనుమతి లేకుండా కట్టడాలు కట్టారని కూల్చివేయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అధికారులు ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. 2023 ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీ అవధూత కాశినాయన ఆశ్రమానికి 12.98 హెక్టార్ల భూమి అవసరమని, ఇందుకు సంబంధించి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు లేఖ రాశారని తెలిపారు. ఆ లేఖను తాను, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో పాటు కొంత మంది ఆలయ నిర్వాహకులు ఢిల్లీ వెళ్లి అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డికి అందజేశామన్నారు. ఆయన కేంద్ర అటవీశాఖ మంత్రికి లేఖను అందజేసి అనుమతులు మంజూరు చేయాలని కోరారన్నారు. తాను పలుమార్లు ఢిల్లీలోని అటవీశాఖ అధికారులతో మాట్లాడానని చెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఫారెస్టు అధికారులతో చర్చలు జరుపుతూ కాశినాయన ఆశ్రమానికి తోడ్పాటు అందించామని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం 8 నెలల్లో మూడుసార్లు ఆశ్రమంలోని నిర్మాణాలను కూల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి తెలియకుండా అటవీ అధికారులు కూల్చివేశారని మంత్రి లోకేష్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేంద్ర అటవీశాఖ అధికారుల ఆదేశాలతో ఇప్పటి జిల్లా కలెక్టర్ జనవరి 1న కాశినాయన ఆశ్రమంలోని కట్టడాలను కూల్చివేయాలని పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, ఏపీఎస్‌పీడీసీఎల్, అటవీశాఖ అధికారులకు జీఓ జారీ చేశారని తెలిపారు. రాష్ట్రం, కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాసిన ప్రకారం 12.98 హెక్టార్ల భూమికి అనుమతి మంజూరు చేయించి కాశినాయన ఆలయ నిర్మాణానికి అనుమతులు తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఆశ్రమాన్ని ఇక్కడ భక్తులే నిర్వహిస్తున్నారని, అలాంటి ఆశ్రమాన్ని అనుమతుల పేరుతో కూల్చివేయడం తగదన్నారు. మంత్రి లోకేష్ అధికారులను తప్పు పట్టడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేనిదే అధికారులు ఎలా కట్టడాలను కూల్చివేస్తారని ప్రశ్నించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ అవధూతగా పేరు పొందిన కాశినాయన ఆశ్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కూల్చివేతలు మొదలు పెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి, మాజీ వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాశినాయన భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

- బంగారు, నగదు అపహరణ
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు



తీవ్ర రక్త గాయాలతో లక్ష్మీదేవి



ఆకుల నవీన్, నిందితుడు (ఫైల్)

కమలాపురం : కమలాపురం పట్టణంలో పట్ట పగలే ఇంట్లోకి దూరి కళ్లల్లో కారం చల్లి కత్తితో దాడి చేసి బంగారు నగలు, నగదు దోచుకెళ్లిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గిడ్డంగి వీధిలో నివాసం ఉన్న కరంగుడి లక్ష్మీదేవి అనే మహిళపై అదే వీధికి చెందిన ఆకుల నవీన్ కత్తితో దాడి చేశాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో లక్ష్మీదేవి ఒంటరిగా ఉన్న విషయం తెలుసుకున్న నిందితుడు ఇంట్లోకి చొరబడి మహిళ కళ్లల్లో కారం చల్లి కత్తితో ముఖం, మెడ, చేతులు, కాళ్లు, గొంతు వద్ద విచక్షణా రహితంగా పొడిచాడు. దీంతో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడింది. ఈ నేపథ్యంలో నిందితుడు లక్ష్మీదేవి ఒంటిపై ఉన్న సరుడు, గాజులు తదితర 10 తులాల మేరకు బంగారు నగలు అపహరించుకు వెళ్లాడు. ఈ ఘటన తెలుసుకున్న ఇరుగు పొరుగు వారు అచేతన స్థితిలో పడి ఉన్న లక్ష్మీదేవిని కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా బాధితురాలు మాట్లాడుతూ పిన్ని అని పిలిచి ఇంట్లోకి దూరి కారం చల్లి కత్తులతో దాడి చేసి తన ఒంటిపై ఉన్న 10 తులాల బంగారు నగలు దోచుకెళ్లాడని, తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని రోదించింది. కాగా బాధితురాలి భర్త శేఖర్ మాట్లాడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి ఇంత ఘోరం చేశాడని బంగారుతో పాటు, రూ.3లక్షల నగదు అపహరించుకు వెళ్లాడన్నారు.

గాలింపు చర్యలు చేపట్టాం: సీఐ ఎస్‌కే రోషన్

గిడ్డంగి వీధికి చెందిన లక్ష్మీదేవిపై దాడి చేసిన ఆకుల నవీన్‌ను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టామని సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. లక్ష్మీదేవి ఇంట్లో ఒంటరిగా ఉందని తెలుసుకున్న నవీన్ ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బీసీసీపీఎల్ సీఎంఓ సాయిరమేష్



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న సీఎంఓ సాయి రమేష్

కమలాపురం : ప్రతి ఒక్క వాహన డ్రైవర్ భద్రతా నియమాలు పాటించాలని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. గురువారం 54వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని నల్లింగాయపల్లెలోని బీసీసీపీఎల్‌లో ఆయన వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ముందుగా భద్రతా పతాకాన్ని ఎగుర వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలు పాటించినపుడే గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవచ్చన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకపోతే అటు యజమానులు, ఇటు డ్రైవర్ కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండవచ్చన్నారు. రెప్పపాటు కాలంలోనే ప్రమాదాలు ముంచుకొస్తాయన్నారు. డ్రైవర్లు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాల బారిన పడతారని, తద్వారా కుటుంబ సభ్యులు వీధిన పడతారని గుర్తు చేశారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీటు బెల్ట్ తప్పక ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె. క్రిష్ణమూర్తి మాట్లాడుతూ భద్రత కంటే ఆరోగ్యం ముఖ్యం అన్నారు. ఈ సంవత్సరం థీమ్ వివరిస్తూ అభివృద్ధి చెందిన భారతదేశంగా ఉండాలంటే మనమందరం ఆరోగ్య సూత్రాలను, భద్రతా చర్యలను పాటించాలన్నారు. భద్రతా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పీపీఈ స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం జగదీశ్వర్ రెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ గోపాల్‌రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ జి.మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఒకరి మృతి



మృతి చెందిన గగ్గుటూరు రాజా



గాయపడిన మహేశ్వర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని మూలవంక గ్రామం నుంచి కొత్తపేటకు వెళ్లే రోడ్డుపై గురువారం మధ్యాహ్నం బైకుకు కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కగా ఉన్న మోరీని ఢీకొనడంతో గగ్గుటూరు రాజా(55) మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మహేశ్వరరెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు గగ్గుటూరు రాజా స్థానిక లింగారెడ్డిపల్లె నివాసి కాగా, వృత్తి రీత్యా వ్యవసాయ పనులు, బేల్దారిమేస్త్రి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బైకు నడుపుతూ తలకు తీవ్ర గాయాలైన మహేశ్వరరెడ్డిని చికిత్స కోసం కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఇతను కూడా స్థానిక లింగారెడ్డిపల్లెకు చెందిన వ్యక్తి కాగా, వ్యవసాయ పనులు, ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిలో దొంగ హల్‌చల్

– మహిళా డాక్టర్ మెడలో బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించిన దొంగ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ దొంగ ఏకంగా మహిళా డాక్టర్ మెడలోని బంగారు గొలుసును లాగేందుకు ప్రయత్నించాడు. అయితే మహిళా డాక్టర్ అప్రమత్తం కావడంతో దొంగ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ ఘటన గురువారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జరిగింది. గైనకాలజిస్ట్ శ్రీవాణి ఆపరేషన్ థియేటర్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి డాక్టర్ మెడలోని బంగారు చైన్‌ను లాగేందుకు ప్రయత్నించాడు. దీంతో డాక్టర్ అతని చేయి పట్టుకుని విసిరేశారు. తర్వాత డాక్టర్ గట్టిగా కేకలు వేయడంతో దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్‌కే ఆస్పత్రిలో సెక్యూరిటీ లేదని పలువురు వాపోతున్నారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రసాద్

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలో వెంగలాయపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు గాదెగూడూరు గ్రామానికి చెందిన సుంకు ప్రసాద్(55) పని నిమిత్తం ప్రొద్దుటూరు వెళుతున్నారు. ఇదే మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన కాసా వెంకటసుబ్బా రెడ్డి ద్విచక్ర వాహనంలో ప్రొద్దుటూరు వైపు నుంచి వెంగలాయపల్లె గ్రామానికి వెళుతూ అతివేగం, అజాగ్రత్తగా పెట్రోల్ బంకు వైపునకు ద్విచక్ర వాహనాన్ని తిప్పడంతో ఈ సంఘటన జరిగింది. రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో సుంకు ప్రసాద్ కింద పడిపోయాడు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య సుంకు మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్‌లలో పోలీసుల తనిఖీలు



కడప నగరంలో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప నగరంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్‌లలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, మేకలదొడ్డి, తదితర ప్రాంతాల్లోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్‌లు, ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ కంపెనీల గోడౌన్‌లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీలలో ఫ్యాక్షన్ జోన్ ఇన్స్‌పెక్టర్ రమణారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

– జిల్లావ్యాప్తంగా 820 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు గురువారం ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరానికి సంబంధించిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 17,747 విద్యార్థులకు గాను 16,927 మంది విద్యార్థులు హాజరయ్యారు. 820 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 16,658 మందికి 15,955 మంది హాజరుకాగా 701 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 1089 మందికి 972 మంది హాజరు కాగా 117 మంది గైర్హాజరయ్యారు.

భవన నిర్మాణాలకు పటిష్టం భారతి సిమెంట్

సింహాద్రిపురం : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంట్ పటిష్టమైనదని భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్లు చిన్న శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్ర, మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, సేల్స్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సింహాద్రిపురంలోని స్వరూపా ఏజెన్సీస్ సమీపంలోని బిల్డర్లు, మేస్త్రీలకు సిమెంట్ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారై అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. అనంతరం 60 మంది మేస్త్రీలకు రూ. లక్ష ఉచిత బీమా బాండు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేటలో ఐపీలతో ప్రజల నెత్తిన టోపీ

ఖాజీపేట : ఖాజీపేటలో ప్రజలకు కుచ్చుటోపీ పెట్టేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వారం రోజుల్లోనే ఇద్దరు వ్యక్తులు ఐపీ పెట్టి ఉడాయించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఖాజీపేటలో శ్రీ శివగణపతి జనరల్ స్టోర్ నిర్వాహకుడు వారం రోజుల క్రితం దుకాణం మూసి ప్రజల నెత్తిన టోపీ పెట్టారు. దాదాపు సుమారు రూ 2.60 కోట్లు బకాయి ఉన్నట్లు తేలింది. బాధితులు అంతా పోలీసులను ఆశ్రయించారు. అలాగే ఖాజీపేటలో సూపర్ మార్కెట్ నిర్వాహకుడు సుమారు రూ.6 కోట్లతో ఉడాయించినట్లు తెలుస్తోంది. తాజాగా ఇది ఖాజీపేటలో పెద్ద సంచలనంగా మారింది. గత రెండు రోజుల నుంచి అతని ఫోన్ పనిచేయడం లేదు. కుటుంబ సభ్యులు కనిపించలేదు. దీంతో చాలా మంది బాధితులు ఖాజీపేట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కేవలం సూపర్ మార్కెట్‌కు సరుకులు ఇచ్చిన బకాయిలే సుమారు రూ.11 లక్షలు ఉన్నట్లు తేలింది. అంతేకాక ఇక నగదు రూపంలో అలాగే చీటీల రూపంలో అందరి వద్ద డబ్బులు వసూలు చేసిన మొత్తం అంతా కలిపితే సుమారు రూ.6 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వారంలో ఇద్దరు వ్యక్తులు ఇలా చేయడంపై బకాయిదారులు లబోదిబోమంటున్నారు.

మహిళ అదృశ్యం



మాధవి(ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న పెద్దపల్లి నాగరాజు తన భార్య పెద్దపల్లి మాధవి (55) ఆచూకీ తెలపాలని కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఈనెల 12వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ తాహీర్ హుసేన్ మహిళ అదృశ్యం కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. పెద్దపల్లి మాధవిని నాగరా 35 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరి కుమార్తె నాగ సురేఖను అమెరికాలో వున్న విజయేంద్రక్రిష్ణకు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు మగపిల్లలు సంతానం. వారిని చూసి వస్తానని నాగరాజు భార్య మాధవి 2023 మార్చి 6వ తేదీన విజిటింగ్ వీసా కింద వెళ్లింది. ఆమె వెళ్లేటప్పుడు తన వెంట 150 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకుని వెళ్లింది. ఈ క్రమంలోనే ఆమె అమెరికాకు వెళ్లక మునుపు తన పేరుమీద యూకో, కెనరా బ్యాంక్‌లలో తమ దగ్గర ఉండిన 750 గ్రాముల బంగారు ఆభరణాలను రూ. 18 లక్షలకు తాకట్టు పెట్టింది. ఆ బ్యాంక్‌లలో రుణాలకు సంబంధించిన వడ్డీని ఆమె అమెరికా నుంచి తిరిగి వచ్చి ఏడాది తరువాత చెల్లించింది. ఆ తర్వాత మూడు, నాలుగు నెలల క్రితం ఆ రెండు బ్యాంక్‌లలో ఉన్న బంగారు ఆభరణాలను ఆమె బంధువులతో కలిసి వచ్చి డబ్బులను చెల్లించి తీసుకుని వెళ్లిపోయింది. ఈ విషయం ఇటీవల బ్యాంక్ అధికారుల వద్దకు వెళ్లి విచారించగా తెలిసింది. తన భార్య అమెరికా వెళ్లి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆచూకీ తెలియరాలేదని,, తన భార్య కనిపించకుండా పోవడానికి తన బావమరుదులు హరికృష్ణ, ప్రభాకర్, తన అత్త సావిత్రమ్మ, తోడల్లుడు సుబ్బరాయుడు, తన మరదలు శైలజ కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే కడప తాలూకా సీఐ సెల్:9121100514కు గానీ, 9121100516కుగానీ తెలియజేయాలని కోరారు.

నాటు సారా నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజ్

చక్రాయపేట : గ్రామాల్లో నాటు సారా నిర్మూలనకు గ్రామస్తులందరూ అధికారులకు సహకరించాలని ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజ్ పేర్కొన్నారు. గురువారం చక్రాయపేట మండలం కల్లూరుపల్లె తాండాలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంలో నాటుసారా నిర్మూలన కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన హాజరై నాటుసారా వలన కలిగే నష్టాలు, వాటి నివారణ చర్యలు ప్రజలకు వివరించారు. అనంతరం డేగ కళాజాత బృందం నాటిక, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, గ్రామ సర్పంచ్ పురుషోత్తం నాయక్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు విశ్వనాథరెడ్డి, చెన్నారెడ్డి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సాదిక్ హుస్సేన్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ అధికారి విచారణ



కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద విచారణ చేస్తున్న రవాణాశాఖ అధికారి శ్వేత

కడప అర్బన్ : కడప నగరంలో ఈనెల 27వ తేదీన రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై రవాణాశాఖ అధికారి శ్వేత గురువారం విచారణ చేపట్టారు. ఏడు రోడ్లవద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేయగా బస్సు కండీషన్‌పై గురువారం ఉదయం రవాణా శాఖాధికారి శ్వేత దర్యాప్తు చేశారు. ఏడు రోడ్ల వద్ద ప్రతిరోజు రాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పదుల సంఖ్యలో నిలబెడుతూ వుండటంతో ట్రాఫిక్ అధికం అవుతోందని పోలీసులు తెలిపారు. ఎన్నిసార్లు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులకు చెప్పినా అక్కడే గంటల కొద్దీ బస్సులు నిలుపుతూ ఉండటంతో ట్రాఫిక్ జామ్ అవ్వడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు కూడా కారణం అవుతున్నాయని చెబుతున్నారు. బస్సుల యజమానులకు త్వరలో నోటీసులు జారీ చేస్తామని ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు.

బర్రెల ఫాం వద్ద విద్యుత్ ప్రమాదం

ఒకరి మృతి, ఇరువురికి గాయాలు

చాపాడు : మండల పరిధిలోని గుంతచీపాడు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఉన్న మురళీకృష్ణ బర్రెల ఫాం వద్ద గురువారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో పాపయ్య(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రెండేళ్ల క్రితం గుంతచీపాడు సమీపంలో మురళీకృష్ణ యాదవ్ అనే వ్యక్తి బర్రెల ఫాంను ఏర్పాటు చేశాడు. ఇక్కడ రాజమండ్రికి చెందిన పోషయ్య కుటుంబంతో పాటు మరో ఇద్దరు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తితో కలసి పాపయ్య మరో ఇద్దరు గ్రాస్ క్రషింగ్ మిషన్ కోసం విద్యుత్ లైన్ లాగే పనులు చేపట్టారు. విద్యుత్ తీగలు లాగుతుండగా పైనే ఉన్న మెయిన్ విద్యుత్ సరఫరా అయ్యే లైన్‌కు తగులుకున్నాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన పాపయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఈయనతో పాటు ఉన్న అతని మామ, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ట్రైనీ డీఎస్పీ భవానీ, ఎస్ఐ చిన్న పెద్దయ్య సంఘటన స్థలానికి చేరుకుని సమగ్ర విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోకుండా, కనీసం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఎల్‌సీ కూడా తీసుకోకుండా విద్యుత్ తీగలను లాగే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌కో మండల ఇన్‌చార్జి ఏఈ రామభద్రయ్యను వివరణ కోరగా.. తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పనులు చేపట్టారన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.